చలేని సమస్య అయితే కాలానికే వదిలెయ్యి' అని.

అలా.. ధీర పెళ్లిని కాలానికే వదిలేసింది.

* * *

హాల్‌లో ఉయ్యాల బల్లమీద కూర్చుని సెల్‌లో మెసేజ్‌లు చూసుకుంటున్న ధీరని చూస్తే ఓవైపు బాధా, ఓవైపు విరక్తి.. సిగరెట్లు, డ్రింక్ చేయడంతోపాటు అబార్షన్ కూడా చేయించుకున్న కూతురికి పెళ్లిచేయాల్సిన తల్లిగా.. తన బాధ్యత ఇంకా పెరిగినట్టు ఉంది అనుకుంటే, అవార్డు ఫంక్షన్లప్పుడు సినిమా హీరోలు, దర్శకులు అనే మాటలా అనిపించి.

వంట చెయ్యడం బోర్. పిల్లల్ని కనడం బోర్. పెంచడం అంతకన్నా బోర్. ఎప్పుడూ సెల్‌తో గడపడం అనేది ఒక ఇంటర్నల్ వ్యాక్యూమ్ లోంచి వచ్చే వ్యాపకం. ఒక వ్యాక్యూమ్‌ని ఇంకో వ్యాక్యూమ్‌తో నింపే ప్రయత్నం. పక్కనున్న మనిషితో మాట్లాడరు కానీ..

''రెండ్రోజుల్లో పెళ్లిచూపులు పెట్టుకుని.. వాళ్లని మోసం చేసినట్టు అవదూ?'' అంతకన్నా ఇంకేం అనాలో తోచలేదు.

''నా పాత రూమ్‌మేట్ లీనా.. హైమెన్ రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీ చేయించుకుని పెళ్లి చేసుకుంది. మోసం అంటే.. చిరిగిన కన్నెపొరకి సర్జరీ చేయించుకుని వర్జిన్‌లా పెళ్లి చేసుకోవడం. అందుకే.. ఎందుకైనా మంచిదని నీకు చెప్పాను. అయినా అవతలి వాళ్లుకూడా అంత మడికట్టుకుని ఏమీ ఉండటం లేదులే!''

''అబార్షన్ చేయించుకుని పెళ్లి చేసుకోవడం మోసం కాదా?''

''అది తప్పేమో కానీ మోసం కాదు''

దేవుడా! ఇంక నావల్ల కాదు. దీన్నంతా భరించే శక్తి ఇవ్వు తండ్రీ. నా బలహీనపు గుండె బద్దలు కాకుండా చూడు స్వామీ!

ధీర.. దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవాలని ఏరికోరి అపురూపంగా పెట్టుకున్న పేరు. ఇప్పుడు ఇందుకు పనికి వస్తోంది. ఎక్కడైనా గొంగళిపురుగు సీతాకోకచిలుక అవుతుంది. కానీ, సీతాకోకచిలుకే గొంగళిపురుగు అవడం ఎక్కడన్నా ఉంటుందా?

అవతలి వాళ్లు అంత మడికట్టుకుని ఉండటం లేదని.. ఇది కూడా ఇట్లా అయిందా? అయినా సృష్టిలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే! ఒకరు ఎక్కువా కాదు, ఒకరు తక్కువా కాదు. ఎవరి అస్తిత్వం వారిదే. మగవాళ్లతో సమానం అవ్వాలని ఆడవాళ్లు మగవాళ్లని ఎందుకు అనుకరించాలి? స్త్రీ పురుషులిద్దరూ కలిస్తేనే కదా పరిపూర్ణత్వం సిద్ధించేది. స్త్రీకి సహజసిద్ధమైన సున్నితత్వం, లాలిత్యం, ఆర్ద్రత ఉంటాయి. ఆ లక్షణాలు పోగొట్టుకుని మార్దవంలేని

**ప్రతి మనిషి జీవితంలో కొన్ని దౌర్భాగ్యకరమైన క్షణాలు ఉంటాయి. అలాంటి క్షణం ఒకటి మన జీవితంలో లేకుండా ఉంటే బాగుండు అనిపించే క్షణాలు. ఇప్పుడు అలాంటిదే ఓ దౌర్భాగ్యకరమైన క్షణంలో ఉన్నాను. తల్లిగా గెలవడమా? మనిషిగా ఓడటమా? తేల్చుకోవాల్సిన క్షణం. నాకే ఒక కొడుకు ఉంటే.. ధీరలాంటి అమ్మాయిని వాడికి ఇచ్చి చేస్తానా? ఆ అబ్బాయి కూడా నాకు కొడుకులాంటి వాడే కదా!**

కరకు మగమొహాలు ఎందుకు అరువు తెచ్చుకోవడం? ఐడెంటిటి క్రైసిస్ ఆడవాళ్ల మొహాల్ని కఠినంగా మగమొహంగా మారుస్తోందా?

''ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావు? వాళ్లకు ఏం చెప్పమంటావు?''

''అదేదో నువ్వే డిసైడ్ చేయి''

అంటే.. ఇప్పుడు బాల్ తనకోర్టులో ఉందన్నమాట. హామ్లెట్ 'టుబి ఆర్ నాట్ టుబి'లా ఇప్పుడు నిర్ణయం చేయాల్సిన బాధ్యత తనది. చేసేదంతా అది చేసి.. కూర్చుని తీర్పు తను చెప్పాలి.

'లండన్ బ్రిడ్జ్ ఈజ్ ఫాలింగ్ డౌన్. ఫాలింగ్ డౌన్'.. టి.ఎస్. ఇలియట్ 'వేస్ట్‌లాండ్'లో అనైతిక సంబంధాల గురించి అన్నమాట గుర్తొచ్చింది. ఒక్క లండన్ బ్రిడ్జేనా కూలిపోతున్నది? అన్ని బ్రిడ్జిలూ కూలిపోతున్నాయి. అన్ని విలువలూ అందులో కొట్టుకుపోతున్నాయి. భర్తలకు తెలియకుండా భార్యలు, భార్యలకు తెలియకుండా భర్తలు, అమ్మానాన్నలకు తెలియకుండా పిల్లలు.. అక్రమమో, సక్రమమో అయిన సంబంధాలు. వాళ్లందరూ పాదాలను సోడానీళ్లతో కడుక్కోవడం మొదలుపెడితే.. ఆ నీళ్లు ఇంకో హిందూమహాసముద్రం అంత అవుతాయేమో. ఆ మహాసంద్రంలో ధీర కూడా ఓ నీటిబొట్టు. అంతేకానీ.. అది సోడానీళ్లతో కాళ్లు కడుక్కున్నంత మాత్రాన దాని కాళ్లు కడిగి కన్యాదానం చేయాలా?

చుట్టూతా ఇంత కమ్ముకున్న విషంలో, ఇంత విషవలయంలో తను ఏ విలువల కోసం పాకులాడుతోంది? ఏ విలువల కోసం ఘర్షణ పడుతోంది? ఏది ఏమైపోతే నాకెందుకు అని ఎందుకు ఉండలేకపోతోంది? అదేమైనా జబ్బా? జబ్బు లక్షణమా?

జయకాంతన్.. 'కొన్ని సమయాలలో కొందరు మనుషుల'కు, తనకు మధ్య ఏదో పోలిక స్ఫురించింది. గంగ అనే అమ్మాయిని డ్రాప్ చేస్తానని కారులో ఎక్కించుకుని అత్యాచారం చేస్తాడు ఒక యువకుడు. గంగ ఈ విషయాన్ని వాళ్ల అమ్మకు చెప్పినప్పుడు ఆమె అరిచి ఏడ్చి ఊరూవాడా ఏకం చేయడంతో.. గంగ పెళ్లికాకుండానే ఉండిపోతుంది. తర్వాత అదే విషయం పత్రికలో కథగా వచ్చినపుడు.. అందులో అత్యాచారానికి గురైన కూతురికి తల్లి తలస్నానం చేయించి.. 'నీకు అంటిన మైల అక్కడితోనే పోయింది. ఇక దాని గురించి మర్చిపో' అంటుంది. మా అమ్మ కూడా అట్లా అరిచి గోల చెయ్యకుండా, అలా తలస్నానం చేయించి ఉంటే.. ఇవాళ ఇలా ఉండాల్సి వచ్చేదికాదు కదా అనుకుంటుంది గంగ.

కానీ, ఆ కథలో గంగ వేరు. అది యాదృచ్ఛికంగా జరిగింది. అందులో గంగ ప్రమేయం లేదు. అలా తలస్నానం చేయించి జరిగిన పొరబాటుని కడిగేయించడానికి ధీర.. 'గంగ' కాదు.

తన ముందున్నది రెండే ఆప్షన్లు. ధీరకు పెళ్లి చేయకుండా వదిలేయడమా? పెళ్లిచేసి విడాకులు తీసుకున్నా.. బాధపడకుండా ఉండటమా? సిగరెట్లు, మందు తాగుతూ.. అబార్షన్ కూడా చేయించుకున్న కోడల్ని క్షమించే అత్తగార్లు, భర్తలు ఉన్నట్టు చరిత్రలో ఎక్కడా ఆధారాలు లేవు. అయితే పెళ్లి చేస్తే తల్లిగా తను సక్సెస్ అయినట్టు. అక్కడికి తన ప్రాణం ఒడ్డున పడుతుంది. పెళ్లి చేయలేని తల్లిదండ్రుల జాబితాలో అయితే ఉండదు.

ప్రతి మనిషి జీవితంలో కొన్ని దౌర్భాగ్యకరమైన క్షణాలు ఉంటాయి. అలాంటి క్షణం ఒకటి మన జీవితంలో లేకుండా ఉంటే బాగుండు అనిపించే క్షణాలు. ఇప్పుడు అలాంటిదే ఓ దౌర్భాగ్యకరమైన క్షణంలో ఉన్నాను. తల్లిగా గెలవడమా? మనిషిగా ఓడటమా? తేల్చుకోవాల్సిన క్షణం. నాకే ఒక కొడుకు ఉంటే.. ధీరలాంటి అమ్మాయిని వాడికి ఇచ్చి చేస్తానా? ఆ అబ్బాయి కూడా నాకు కొడుకులాంటి వాడే కదా!

ఉయ్యాలలో కూర్చుని గోళ్లకు నెయిల్ పాలిష్ వేసుకుంటున్న ధీరని చూస్తే ఏదో తెలియని ఆవేశం. నన్నిట్లా సుడిగుండంలో నెట్టి..

గబగబా దాని దగ్గరికి వెళ్లాను.

''చూడు ధీరా! విలువలు అనేవి ఎవరికోసమో ఉండేవి కాదు. ఎవరివి వారికే ఉండేవి. ఒకళ్ల కోసం తెచ్చిపెట్టుకునే విలువ సరైన విలువ కాదు. శాశ్వతమైన విలువలు కొన్ని ఉంటాయి. ఆడవాళ్లకైనా, మగవాళ్లకైనా, లేకపోతే నువ్వు ఈమాట చెప్పాల్సి వచ్చేదే కాదు. చేసినదాన్ని దేన్నయినా ధైర్యంగా ఫేస్ చేయడం నేర్చుకో. అది మంచిదైనా, చెడ్డదైనా! పెళ్లి కావాల్సిన కూతురు అబార్షన్ చేయించుకున్నానని చెబితే.. ఇవాళా రేపూ ఇది మామూలేగా అని తల్లిదండ్రులు అనుకునేంతగా సమాజం మారిపోయిందేమో నాకు ఇంకా తెలీదు. అది నా వెనుకబాటుతనం అనుకుంటే నాకు ఆ వెనుకబాటుతనమే ఇష్టం. నీ గురించి నువ్వు పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోగలిగినంత పెద్దదానివయ్యావు. నీకు నేను ఇంకా ఏదో చెయ్యగలనని నేను అనుకోవడం లేదు. నీ పెళ్లి నువ్వే డిసైడ్ చేసుకోవడం మంచిది. ఆ పెద్దరికం నాకు వద్దు. తర్వాత నీ ఇష్టం!''

* * *

తప్పిపోయిన నా కూతురు మళ్లీ ఎప్పుడో.. ఎక్కడో కనిపిస్తుందని చిన్న ఆశ. తల్లిగా ఆ మాత్రం ఆశపడటంలో తప్పులేదేమో? ■

## జి. లక్ష్మి



ప్రతి మనిషి జీవితంలోనూ కొన్ని దౌర్భాగ్యకరమైన క్షణాలు ఉంటాయి. 'తల్లిగా గెలవడమా? మనిషిగా ఓడటమా?' అని తేల్చుకోవాల్సిన క్షణాల్లోనే ఉన్న ఓ తల్లి కథ.. తప్పిపోయిన కూతురు. రచయిత్రి జి. లక్ష్మి. వీరి స్వస్థలం కృష్ణా జిల్లా గుడివాడ. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి దినపత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత గ్రూప్-2 సాధించి.. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగంలో చేరారు. జిల్లా రిజిస్ట్రారుగా పనిచేసి.. ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఇప్పటివరకూ దాదాపు 60 కథలు, ఒక నవలిక రాశారు. స్వీయ కథా సంకలనాలు 'పూలు పూయని నేల', 'అభయారణ్యం', 'జి. లక్ష్మి కథలు'.. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ద్వారా ప్రచురించారు. ఆల్బర్ట్ కామూస్ 'ది అవుట్ సైడర్' నవలను 'అపరిచితుడు'గా, ప్రముఖ జర్మన్ రచయిత కాఫ్కా కథలను 'కాఫ్కా కథలు'గా తెలుగులోకి అనువాదం చేశారు. ప్రముఖ నోబెల్ రచయితల కథలను 'నోబెల్ కథలు'గా, నోబెల్ బహుమతి గ్రహీత ఆలిస్ మన్రో కథలను 'ఆలిస్ మన్రో కథలు'గా అనువదించారు. వీరి కథలు పదిహేను వరకూ హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి అనువాదం అయ్యాయి.